పక్కదారి పడుతున్న డబుల్ సర్వే

డబుల్ బెడ్రూం ఇండ్ల సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

- ఇండ్లు వచ్చేలా చేస్తామంటూ డబ్బు వసూలు
- సర్వే పేరిట కొంతమంది సిబ్బంది అక్రమాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 13: డబుల్ బెడ్రూం ఇండ్ల సర్వే జీహెఎంసీ సర్కిల్-15 ముషీరాబాద్ నియోజకవర్గంలో పక్కదారిపడుతుంది. కొంతమంది సర్వే సిబ్బంది, అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంటికి వచ్చి సర్వే చేయడానికి, జాబితాలో పేరు ఉందో లేదో చెప్పడానికి డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు సిబ్బంది ఏకంగా డబుల్ బెడ్రూం ఇప్పిస్తామంటూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. పేదల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఇండ్లు ఇప్పిస్తామంటూ డబ్బులు గుంజుతున్నారు. ఇదిచాలదన్నట్లు కొంతమంది బ్రోకర్లు, జీహెచ్ఎంసీ సిబ్బంది కుమ్మక్కై సర్వేను చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. తాము చెప్పిన వారి ఇండ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. ప్రజలు సైతం తమకు ఇండ్లు వచ్చేలా చూడాలంటూ సర్వేకు వచ్చిన సిబ్బందికి ఎంతోకొంత ముట్టజెప్తున్నారు. దాదాపు నెల రోజులుగా సర్వే కొనసాగుతోంది. నియెజకవర్గంలో మొత్తం 37008 మంది డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం దఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఇప్పటి వరకు 60 శాతం పూర్తి కాగా 40 శాతం చేయాల్సిఉంది. ఒక్కో డివిజన్‌కు నాలుగు ఐదు టీమ్‌ల చొప్పున సర్వే చేస్తుండగా కొంతమంది సిబ్బంది ఇటీవల అవినీతికి పాల్పడుతున్నారని బాహాటంగానే ఆరోపణలు చేస్తున్నారు. జాబితాలో పేరు ఉందో, లేదో పరిశీలించాలన్నా, ఒక వేళ జాతాలో పేరు ఉన్నా ఇంటికి వచ్చి సర్వే చేయాలన్నా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఓ డివిజన్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఉద్యోగి డబుల్ బెడ్రూం ఇప్పిస్తామంటూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం.

ఇప్పటి వరకు 22572 ఇండ్ల సర్వే చేసి వివరాలు యాప్‌లో నమోదు చేసిన అధికారులు మరో 14436 దరఖాస్తులు చేయాల్సి ఉంది. అడిక్‌మెట్ 4737, ముషీరాబాద్ 5853, రాంనగర్ 8625, భోలక్‌పూర్ 6812, గాంధీనగర్ 3481, కవాడిగూడ 7500 మంది దఖాస్తు చేసుకున్నారు.

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలి: డీఎంసీ

డబుల్ బెడ్రూం సర్వేకు వచ్చే సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగితే ఎట్టిపరిస్థితుల్లో ఇవ్వకూడదు. సిబ్బంది లేదా బ్రోకర్లు ఎవరైనా మాయమాటలు చెప్పి అక్రమాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని సర్కిల్-15 డిప్యూటీ కమిషన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) అందించే ఎంబీఏ కోర్సు పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీడీబీఎం, పీజీడీఎం, పీజీడీ ఈఎల్టీ తదితర కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

బీఎస్ - ఎంఎస్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సి: ఓయూ పరిధిలోని బీఎస్- ఎంఎస్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్-ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్- ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం) మొదటి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 24వ తేదీలోపు సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చేనెల 1వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఆహ్వానం

అమీర్‌పేట్, ఫిబ్రవరి 13: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని బాపూనగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిసింగ్ జాదవ్ తెలిపారు. ఈ మేరకు బస్తీలోని సంత్ సేవాలాల్ మహారాజ్‌ఆలయాన్ని వేడుకలకు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి భక్తులు సేవాలాల్ మహారాజ్‌కు పూజలు నిర్వహిస్తారని, ఉదయం 9:21 గంటలకు మహా భోగ్ జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. వేడుకలకు హాజరు కావాల్సిందిగా కోరుతూ బస్తీకి చెందిన గోపీచంద్, రాజు, పవన్ తదితరులతో కలిసి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేసినట్టు తెలిపారు.

మహిళా బాక్సర్‌కు ఎమ్మెల్యేల అభినందన

వర్షిత అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, ఫిబ్రవరి 13: పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్నైనా సాధించడం కష్టమేమీ కాదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్ పేటకు చెందిన సిల్వరి పరమేశ్ కుమార్తె వర్షిత రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసానిని మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వర్షితను ఎమ్మెల్యే అభినందించారు. వర్షిత వెంట బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు, నాయకులు కుమార్, దేశపాక శ్రీనివాస్, అరుణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు

నగరానికి చెందిన మహిళా బాక్సర్ సిల్వరి వర్షిత బాక్సింగ్ చాంపియన్‌షిప్ సాధించి తెలంగాణ రాష్ట్ర ఉత్తమ మహిళా బాక్సర్‌గా షీల్డును కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. నేపథ్యంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ ను ఆమెను అభినందించారు. గురువారం మోండా మార్కెట్ లోని తన నివాసంలో కలుసుకున్న వర్షితను అభినందించి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని, ముస్ముందు మరింతగా రాణించాలని పద్మారావుగౌడ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ మనోజ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

– సికింద్రాబాద్, ఫిబ్రవరి13:

శ్రీరామమూర్తికి జీవన సాఫల్య పురస్కారం

పురస్కార గ్రహీతలతో ఎస్.వేణుగోపాలాచారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 13: శ్రీ కమలాకర చారిటబుల్ ట్రస్టు, కమలాకర లిలత కళాభారతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో డాక్టర్ సరోజినీ నాయుడు జయంతి, వివిధ రంగాల ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి ఎస్.వేణుగోపాలాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రముఖ జర్నలిస్టు ఉడయవర్లు, ప్రముఖ సాహితీవేత్త చిమ్మపూడి శ్రీరామమూర్తికి జీవన సాఫల్య పురస్కారాలు అందించి సత్కరించారు. అనంతరం చేబ్రోలు శశిబాల, సాధనాల వెంటక స్వామి నాయుడుచే కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్త వొలేటి పార్వతీశం, ఓరుగంటి భాగ్యలక్ష్మి, టి.శ్రీలక్ష్మి, భారతీ కమలాకర్, కె.లిలతా పరమేశ్వరి, జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

అడ్డగుట్ట, ఫిబ్రవరి13: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారుల నుంచి అధిక డబ్బులను వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్ హెచ్చరించారు. అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లోని మీసేవా కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి మీ సేవా కేంద్రాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ దరఖాస్తుదారుల నుంచి నిర్ణయించిన రుసుము కంటే అధిక డబ్బు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మీ సేవా నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే పేద, మధ్యతరగతి ప్రజలకు మీ సేవ నిర్వాహకులు సానుకూలంగా స్పందించి సౌకర్యవంతమైన సేవలను అందించాలని ఆయన సూచించారు. ఈ తనిఖీలో సీనియర్ అసిస్టెంట్ మోహన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత

బన్సీలాల్ పేట్, ఫిబ్రవరి 13: బోయిగూడ కు చెందిన కిషన్ కుమార్తె చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన లక్షా యాభై వేల రూపాయల పత్రాన్ని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం లబ్ధిదారులకు అందజేశారు. బీఆర్ యస్ నాయకులు లక్ష్మీపతి, జనార్దన్, షంశుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కుమార్‌కు ఘన సన్మానం

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, సికింద్రాబాద్ రీజియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన గుర్రం పవన్ కుమార్ గౌడ్ ను బీఆర్ఎస్ నాయకులు మహేందర్ గౌడ్, హరిచారి, సాయి రాంచారి, సుధాకర్ రెడ్డి, ముక్క శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు.

వేసవిలో నీటిఎద్దడి రాకుండా చర్యలు

కలుషిత నీటి సరఫరా సమస్యను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 13: తాగునీటిలో కలుషిత జలాలు సరఫరా కాకుండా చర్యలు చేపడుతున్నామని సీతాఫల్ మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. నామాలగుండులోని తన నివాసంలో వాటర్ వర్క్స్ అధికారులతో సమావేశమయ్యారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి కొరత లేకుండా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు అలాగే కలుషిత నీరు వస్తున్నదని ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పని చేయాలని సూచించారు. తాను నివసించే అపార్ట్ మెంట్‌లోనే సమస్య ఉందని వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్ తో పేర్కొన్నారు. సమస్యను గుర్తించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నీటిని వృథా చేయొద్దని ప్రజలకు కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సీతాఫల్ మండి డివిజన్ లో ఏదైనా పవర్ బోర్స్, హ్యాండ్ బోర్స్ రిపేర్ లో ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీ

రోడ్ సేఫ్టీ ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13: బాగ్ లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన ప్రారంభించారు. విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి 'వేగం వద్దురా ప్రాణం ముద్దురా.. హెల్మెట్ ధరించడం ప్రాణాలకు రక్షించుకోవడం' నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వరలక్ష్మి మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పించామని, ప్రజలకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. సీనియర్ అధ్యాపకులు స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ www. osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీసీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీసీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దీవాల్యుయేషన్ కు ఒక్కో పేపర్ కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 21వ తేదీలోగా టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్కు రూ.1000 చొప్పున చెల్లించి 21వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

పలు పరిపాలనాపరమైన పదవుల నియామకం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నతాధికారులు పలు పరిపాలనాపరమైన పదవుల నియామకం చేపట్టారు. ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ జాయింట్ డైరెక్టర్ గా జువాలజీ విభాగానికి చెందిన డాక్టర్ నాగేశ్వరరావు ఆమంచి, జెనెటిక్స్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్పర్సన్ గా డాక్టర్ సుమన్ లత, ఫార్మసీ విభాగం హెడ్ గా ప్రొఫెసర్ రమేశ్‌కుమార్, సివిల్ సర్వీసెస్ అకాడమీ కోఆర్డినేటర్ గా డాక్టర్ విజయ్ కుమార్, ఇస్లామిక్ స్టడీస్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్పర్సన్‌గా షాహబ్ అల్తాఫ్, హెడ్గా డాక్టర్ సయ్యద్ అజీముద్దీన్, ఉస్మానియా యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ ఇంచార్జ్ డైరెక్టర్ గా ప్రొఫెసర్ కృష్ణ కుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ గా ప్రొఫెసర్ హడ్య, ఐక్యూఏసి కోఆర్డినేటర్ గా డాక్టర్ సంధ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఓయూ రిజిస్టర్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

భారతీయులపై ట్రంప్ చర్యలు అమానవీయం

ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నాయకులు

కవాడిగూడ, ఫిబ్రవరి 13: అమెరికాలోని భారతీయులతోపాటు విదేశీయుల పట్ల అక్కడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాలో అక్రమంగా ఉండడంతో పాటు పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్నారంటూ చేతులకు కాళ్లకు ఇనుప సంకెళ్లు వేసి సైనిక విమానాలలో వారి దేశాలకు అవమానకర పద్ధతిలో తిరిగి పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. విదేశీయుల పట్ల అమెరికా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ మానవ హక్కులను అంతర్జాతీయ న్యాయ సుత్రాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ (ఏఐపీఎస్ఓ) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐపీఎస్ఓ జాతీయ నేత, పీస్ అవార్డు గ్రహీత కె.యాదవరెడ్డి, ఏఐపీఎస్ఓ జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కాన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, ఏఐపీఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేపీఎల్, ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వర రావు, రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ ప్రమాణ స్వీకరం చేసినప్పటి నుంచి అంతర్జాతీయ సమాజంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలో ఉన్న విదేశీయులు పార్ట్ టైం ఉద్యోగాలు చేయకూడదని అమానవీయ పద్ధతుల్లో తిప్పిపంపించడం గర్హనీయమన్నారు. ఒక వైపు యుద్ధాలను నిలువరిస్తామని చెబుతూ మరోవైపు గాజాను సొంతం చేసుకుంటామని, పాలస్తీనీయులు ఎవరూ తిరిగి రావడానికి వీలులేదంటూ ఇజ్రాయిల్ ఒప్పందాలు చేసుకోవడం వంటి చర్యలు ప్రపంచ శాంతికి తీవ్ర విఘాతమని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సామ్రాజ్యవాద పెత్తందారి విధానాలతో పాటు విదేశీయుల పట్ల అవమానకర పద్ధతుల్లో వ్యవహరిస్తున్న తీరును మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐప్సో రాష్ట్ర నాయకులు ఉమా మహేశ్, జె.కె.శ్రీనివాస్, పోలగాని రవికిరణ్, కిరణ్, హసన్, నరేంద్ర ప్రసాద్, రజాక్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు..

దాతల చేయూత.. అదనపు తరగతి గదులు

అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న సనత్‌నగర్ కార్పొరేటర్

అమీర్‌పేట్, ఫిబ్రవరి 13: పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సనత్ నగర్ రౌండ్ టేబుల్ స్కూల్లో మౌలిక వసతులు పెరగడం లేదు. దీంతో ఒకే తరగతి గదిలో వేర్వేరు తరగతుల చిన్నారులకు బోధన జరుగుతుండడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి స్కూల్‌కు సమీపంలో ఖాళీగా ఉన్న టీఆర్టీ క్వార్టర్‌ను విద్యార్థుల కోసం వినియోగంలోకి తేవాలన్న ఆలోచన మేరకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ సహకారంతో చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అంశాన్ని సనత్‌నగర్ పారిశ్రామికవాడలోని సిప్రా ల్యాబ్స్ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అవసరమైన మరమ్మతులు చేపట్టి తీర్చిద్దారు. దాతలు జెక్‌కాలనీకి చెందిన సిప్రా సంస్థ యాజమాన్య ప్రతినిధి శ్రీహరితో కలిసి కార్పొరేటర్ గురువారం అదనపు తరగతి గదులను ప్రారంభించారు.

PUBLIC NOTICE

It is inform the general public that my client Sri Sardar Karamjeet Singh, S/o. Sardar Uttam Singh is R/o. H.No. 6-3-672/1, Panjagutta, Hyderabad, has entered into an agreement with Smt. Gundamala Archana, D/o. Gundamala Balaswamy, R/o. H.No. 13-145, Subash Colony, Bhupalpalle, Warangal, Telangana state for purchase of House bearing Municipal No. 6-3-1185/88/A (PTIN 1100632330) consisting of Ground Floor and First Floor, admeasuring on an area of 118.44 Sq.Yards or equivalent to 99.01 Sq.Mts., situated at Bhola Sahab Maktha, Begumpet, Hyderabad, T.S., bounded by North: 12 Feet Lane, South: House of Y.Anitha, East: H.No. 6-3-1185/78/1, West: 16 Feet Lane and paid substantial amount in respect of said property.

It is further informed that if any persons are interested in claiming the title over the above said House may contact the undersigned with relevant documents with in 15 days from the date of publication, failing which my client will proceed with the execution of sale deed in his favour and no objections whatsoever will be entertain subsequently.

TS/2030/1998

G.MALLESHAM YADAV, Advocate
5-5-8/5, F-301, Vishnu Enclave,
N/R Rao's High School,
Sangeeth Nagar, Kukatpally,
Hyderabad-72, **Cell: 9948992212.**

గాంధీలో హిప్ ఆర్థోస్కోపి వర్క్‌షాప్

బన్సీలాల్ పేట్, ఫిబ్రవరి 13: గాంధీ ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో హిప్ ఆర్థోరోస్కోపీ, క్యాడవరి లైవ్ సర్జరీ వర్క్ షాప్ నిర్వహించారు. టోసాకాన్ 2025 లో భాగంగా గురువారం గాంధీ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం హెచ్ఓడి, డాక్టర్ బి. వాలియా అధ్యక్షతన జరిగిన ఈ శిబిరాన్ని తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తిమ్మారెడ్డి, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, ఫోరెన్సిక్ విభాగం హెచ్ఓడి డాక్టర్ కృపాల్ సింగ్, నిమ్స్ ఆర్థోపెడిక్ హెచ్ఓడి డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖలో ఎస్సై ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్న ఓ యువతికి తుంటి భాగంలో గాయం కావడంతో వైద్యులు విజయవంతంగా హిప్ ఆర్థోస్కోపీ సర్జరీ నిర్వహించారు. అనంతరం ఫోరెన్సిక్ విభాగం సహకారంతో ఓ మృతదేహానికి ఆపరేషన్ నిర్వహించి లైవ్ డెమో ద్వారా ఇతర జూనియర్ ఆర్థో డాక్టర్లకి ప్రత్యక్షంగా వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి హిప్ ఆర్థోస్కోపీ లైవ్ డెమో తొలిసారిగా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని డాక్టర్ బి.వాలియా తెలిపారు. ఈ వర్క్ షాప్ లో గాంధీ ఆర్ ఎం ఓ డాక్టర్ శేషాద్రి, ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్ బి. శ్రీనివాస్, ఇతర ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొన్నారు. వర్క్ షాప్ లో గెస్ట్ ఫ్యాకల్టీగా డాక్టర్ రవీంద్ర గూడేన (యుకె), డాక్టర్ పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ అశోక్ సెల్వరాజ్, డాక్టర్ రాఘవేంద్ర ప్రసంగించారు.

భర్తతో గొడవపడి అదృశ్యం

బొల్లారం, ఫిబ్రవరి 13: కుటుంబ కలహాలతో భర్తతో గొడవపడి మహిళ అదృశ్యమైన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్ కు చెందిన సరే ఫుల్ మండల్, రహీమా బీబీ భార్యా భర్తలు. జీవనోపాధి నిమిత్తం బొల్లారంలో నూతనంగా నిర్మిస్తున్న టీమ్స్ ఆస్పత్రిలో ఎనిమిది నెలల నుంచి దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. ఈ నెల 8న ఇరువురు గొడవపడ్డారు. కూరగాయలకు వెళుతున్నానని పనిచేస్తున్న ప్రదేశం నుంచి బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్త కుటుంబ సభ్యులను, స్నేహితులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.